క్లుప్తంగా

17న విశ్వకర్మ విశ్వశాంతి వేడుకలు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీగాయత్రి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 17న శ్రీ విరాట్ విశ్వకర్మ విశ్వశాంతి యజ్ఞ మహోత్సవాలు ఘనంగా జరపుతున్నట్లు మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు పులుకూరి సురేష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేదపండితులు బ్రహ్మశ్రీ సాలన శివయ్య శాస్త్రి, బ్రహ్మశ్రీ ఉమ్మడిసింగ్ కాశేశ్వరాచారి శాస్త్రిలు సారథ్యంలో దంపతులచే విశ్వకర్మ వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. భక్తులందరు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఆయనతో పాటు మండల విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు కుమ్మరిపల్లి బ్రహ్మం, పులుకూరి శ్రీనివాసరావు, కొండ్రముట్ల రుద్రమాచారి, రావినూతల వెంకటేశ్వర్లు, పులుకూరి వెంకట కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

శ్రేష్ఠమైన విద్య యోగ



నరసరావుపట ఈస్ట్: యోగ విద్య శ్రేష్ఠమైనదని శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు ఏ.వెంకటేశ్వర గురూజీ తెలిపారు. యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 177వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన ఆనందోత్సవంలో పాల్గొన్న అభ్యాసకులకు వేంకటేశ్వర గురూజీ ఆడియో సందేశం అందించారు. శారీరకంగా, మానసికంగా ఎదురయ్యే సమస్యలను యోగా ద్వారా తేలికగా పరిష్కరించుకోవచ్చని వివరించారు. భౌతిక, మనస్సు, ఆత్మ మూడింటినీ చక్కబెట్టుకుంటేనే జీవితం పరిపూర్ణమవుతుందని స్పష్టం చేశారు. శిక్షణకు హాజరైన అభ్యాసకులకు ప్రాంతీయశాఖ నిర్వాహకుడు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ జ్ఞాపికలను అందచేశారు.

హిందీ భాషను అందరూ నేర్చుకోవాలి



చిలకలూరిపేట: జాతీయ భాష హిందీని అందరూ నేర్చుకోవాలని వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ దండా పవన్‌కుమార్ చెప్పారు. వికాస్ పాఠశాలలో శనివారం హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భాష హిందీ నేర్చుకోవడం ద్వారా దేశంలో ఎక్కడైనా మాట్లాడవచ్చని పేర్కొన్నారు. దేశంలోని ప్రతిభాష గొప్పదని, అదే సమయంలో జాతీయ భాషపైన దృష్టి సారించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీలో చిక్కు ప్రశ్నలు, పద్యాలు, పాటలు, నృత్య ప్రదర్శించి నిర్వహించారు. హిందీ చేతి రాత పోటీలు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికేట్లు, బహుమతులు అందజేశారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ వినుకొండ ప్రాజెక్టు సీడీపీవో ఎం. అనురాధ ఆదేశాల మేరకు వినుకొండ మండలంలోని నరగాయపాలెం సెక్టార్ పరిధిలోని ఉప్పరపాలెం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈసీసీఈ డే సెలబ్రేషన్స్ జరిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో జరిగే ప్రీ స్కూల్ కార్యక్రమాల గురించి తల్లులకు వివరించారు. బాలింతలకు తల్లిపాలు బిడ్డకు పట్టే విధానం గురించి వివరించడం జరిగింది. తర్వాత పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం జరిపి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాల గురించి వివరించారు. పౌష్టికాహార మాసోత్సవాల ర్యాలీ నిర్వహించి తల్లులతో గ్రామ కూడలి వద్ద మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.నాగరాజుకుమారి, అంగన్‌వాడీ టీచర్స్ టి.సుజాత, కె.ఆరోగ్యం, ఏఎన్‌ఎం అంజలి, ఎం.సామ్రాజ్యం, ఆశలు, ఎం.శ్రీదేవి, వై.శైలజ, డి.లీలావతి పాల్గొన్నారు.

విమోచన ప్రార్థన మందిరంలో చోరీ

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో విమోచన ప్రార్థన మందిరంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు గడి పగలకొట్టి చోరీకు పాల్పడినట్లు విమోచన ప్రార్థన మందిరం మతబోధకులు సీహెచ్.యేజేస్కేలు తెలిపారు. కానుకల హుండీ, యాంపిల్ ఫైర్ చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

- రొంపిచర్ల మండలంలో 8 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి
- మెలకువలు పాటించాలంటూ అధికారుల సూచన



వరి నాట్లు వేస్తున్న కూలీలు

రొంపిచర్ల: మండలంలోని మాగాణి పొలంలో వరినాట్లు ముమ్మరంగా వడివడిగా సాగుతున్నాయి. మండలంలో ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో వరిపైరు సాగు చేయాల్సి ఉంది. ఇప్పటికి మండలంలో 8 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అయ్యాయి. పూర్తి అయిన విస్తీర్ణంలో సాగు నీరుతో పనిలేకుండా బావులు, బోర్లు, వాగులు, వంకలపై ఆధారపడి వెయ్యి ఎకరాల్లో ఆగస్టు నెలలోనే వరినాట్లు వేశారు. అయితే గత వారం రోజుల వ్యవధిలో 7 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. సాగర్ కాల్వలకు సాగు నీరుతో పాటు వర్షాలు కూడా అధికంగా ఉండటంతో భూములు దమ్ము ఎక్కువ అవుతుంది. వరి నారు ఎలాంటి చీడపీడలు లేకుండా వాతవరణం అనుకూలించటంతో నిర్ణీత కాలంలోనే యాతకు వచ్చింది. దీనికి తోడు బాపట్ల, రేపల్లె, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు బెంగాల్ రాష్ట్రం నుంచి కూడా వరి నాట్లు వేసేందుకు వలస కూలీలు ఎక్కువగా వచ్చారు. పొలం దమ్ము చేయడంలో గట్లు వేయడంలో యంత్రాలు ఎక్కువగా ఉపయోగించటం వల్ల తక్కువ సమయంలోనే నాట్లు వేసేందుకు అనుకూలంగా మాగాణి భూములు తయారవుతున్నాయి. భూములు దమ్ము అవగానే ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి నాట్లు వేసేందుకు కూలీలు విరివిగా లభ్యం అవుతున్నారు. వలస కూలీలు ఎకరాకు రూ.4500 రూపాయల చొప్పున కాంట్రాక్ట్ తీసుకొని నారుతీసి, నాట్లు వేసి, పాయలు కూడా తీస్తున్నారు. స్థానికంగా ఉండే కూలీలు ఎకరాకు నాటు వేసేందుకే రూ.4000 రూపాయలు తీసుకుంటున్నారు. అయితే మాగాణి మండలం నారు చిమ్మేందుకు అలాగే పాయలు తీసేందుకు మరో వెయ్యి రూపాయలు అదనంగా తీసుకుంటున్నట్లు రైతులు వెల్లడించారు. బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు వేసే నాట్లు ఓ క్రమ పద్ధతిలో మొక్కలు ఉంటుండగా, గోదావరి జిల్లాల నుంచి వచ్చిన వలస కూలీలు నాట్లు విషయంలో కుదుళ్లలో ఓ మొక్క నారు ఎక్కువగా నాటుతూ మొక్కకు మొక్కకు మధ్య గది ఎక్కువగా ఉంచుతున్నారు. స్థానిక కూలీలు నారు ఎక్కువగా కుదుళ్లలో నాటుతూ ఎక్కువ పాదులు నాటుతున్నట్లు రైతులు వెల్లడించారు. అలాగే ప్రస్తుతం రైతులు బెంగాల్ నుంచి వచ్చిన కూలీలతోనే వరినాట్లు వేయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఏదిఏమైనా ఈ ఏడాది ఆలస్యంగా సాగు నీరు వచ్చినా, సాగు నీరు, వర్షం, వ్యవసాయ కూలీలు సమృద్ధిగా ఉండటంతో వరినాట్లు వేగవంతంగా సాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరో రెండు వారాల్లో వరి నాట్లు పూర్తి అవుతాయని రైతులు తెలుపుతున్నారు.



మాగాణి పొలంలో ప్రత్యేక పరికరంతో గట్లు వేస్తున్న ట్రాక్టర్‌లు

వరి నాట్లలో మెలకువలు తప్పనిసరి

శావల్యాపురం: నాట్లు వేయటానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేసేందుకు ప్రారంభించి 2-3 దఫాలుగా నీటిలో మురగ దున్నాలి. పచ్చిరొట్టె ఎరువులు జనుము 8-10 కిలోలు ఎకరానికి వేసి కలియదున్నాలి. దీనివలన పంటకు సేంద్రియ పోషకాలు అందుతాయి. భూసార పరీక్షలు ఆధారంగా సాగు చేయటం వలన సాగు ఖర్చు తగ్గుతుంది. యూరియా, ఎంటీపీ ఎరువులను మూడుసార్లు దుక్కిలో, పిలకల వేసే దశలో చిరుపొట్ట దశలో సమపాళ్ళుగా వేసుకోవాలి.

మూడు ఎకరాల్లో సాగు చేస్తున్నా..



ఏటా వరి సాగు చేయాలంటే పొలంలో దుక్కులు తడిపేందుకు ఆలస్యం అయ్యేది. సాగు నీటికి తోడుగా వర్షాలు కురువడం వల్ల త్వరగా దమ్ము అయ్యింది. ట్రాక్టర్‌తో దమ్ము చేయించి గట్లు వేయించాం. పొలం దమ్ము కాగానే నాట్లు వేసేందుకు కూలీలు అందుబాటులో ఉన్నారు. మూడు ఎకరాల్లో వేగంగా మాగాణి నాట్లు ప్రక్రియ ముగిసింది.

–సైదా సాహెబ్, రైతు, విప్పర్ల

మెలకువలు పాటించాలి



నారు తీసేటప్పుడు లేతాకు పచ్చగా ఉంటేనే మాస త్వరగా తిరుగుతుంది. నాలుగు నుంచి ఆరు ఆకుల ఉన్న నారును ఉపయోగించాలి. సీజను ఆధారంగా నారును నాటితే అనుకున్న రీతిలో దిగుబడులు వస్తాయి. నారు నాటే ముందు కొనలు తుంచి నాటుకోవాలి. తద్వారా కాండం తొలుచు పురుగు ఉధృతి తగ్గించవచ్చు. నాట్లు వేసే సమయంలో కాలిబాటలు ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు తీయడం వల్ల (తూర్పు, పడమర)గా సూర్యరశ్మి గాలి వెలుతురు పంటకు బాగా అంది వరిలో చీడ పీడల ఉధృతి తగ్గించటంతో పాటు పురుగుమందుల పిచికారీకి అనువుగా ఉంటుంది. వరి రకాల కాల పరిమితిని ఆధారంగా కుదుళ్ళ సంఖ్యను నిర్ధారించుకోవాలి. భూసారం ఎక్కువుగా ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్ళు, తక్కువ ఉన్న పొలాల్లో ఎక్కువ కుదుళ్ల ఉండేలా నాటుకోవాలి. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు సేంద్రియ ఎరువులనే వినియోగించాలి. రసాయనిక ఎరువులను ఇష్టానుసారంగా వినియోగిస్తే ఆశించినస్థాయిలో దిగుబడులు రాక రైతులకు పెట్టుబడులు పెరుగుతాయి.

–బోయపాటి రవిబాబు, వినుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు

నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టిపెట్టాలి

- సమస్యకు పరిష్కార దిశగా మేధస్సుని వాడాలి
- తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ
- పలు కళాశాలల్లో ఇంజినీర్స్ డే



తిరుమల కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణ



ఎస్ఈసీలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మిట్టపల్లి రమేష్‌బాబు

నరసరావుపేట రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కొనుగొనే దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు తమ మేథస్సును ఉపయోగించాలని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ తెలిపారు. కళాశాలలో శనివారం ఇంజనీర్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వై.వి. నారాయణ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టిపెట్టాలని తెలిపారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఈసీ కళాశాలలో..

57వ ఇంజనీర్స్ డే వేడుకలను నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. కళాశాలలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డా.సునీల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇంజనీర్‌గా దేశ ఖ్యాతిని నలుదిశలా చాటిన మహోన్నత వ్యక్తి విశ్వేశ్వరయ్య అని తెలిపారు. మనిషి మేధస్సుకు శాస్త్రీయత తోడైతే మహాద్భుతాలు సృష్టించవచ్చని ఆయన నిరూపించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18 నుంచి స్కూల్‌గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

నాదెండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18,20,21 తేదీల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చిరుమామిళ్ళ పీఈటీ, ఫెడరేషన్ క్రీడాశ్రీ కేవీ నాగరాజు తెలిపారు. ఈ నెల 18న ఉదయం 9 గంటలకు సాతులూరు జెడ్పీ హైస్కూలులో ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. 20న చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జెడ్పీ హైస్కూలులో వాలీబాల్ పోటీలు, 21న అమీన్‌సాహెబ్‌పాలెం జెడ్పీ హైస్కూలులో యోగా, చెస్ పోటీలు జరుగుతాయన్నారు. తమ పాఠశాలల క్రీడాకారులను ఆయా పాఠశాలల పీఈటీలు తర్ఫీదునిచ్చి పోటీలకు హాజరుపరచాలని కోరారు.


గోగులపాడులో గ్రామదేవతల జాతర ప్రారంభం



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గ్రామ దేవతల జాతరోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతి, పావనాలకు శుక్రవారం రాత్రి గ్రామోత్సవాలు నిర్వహించారు. గ్రామ దేవతలు అయిన పోలేరమ్మ, అద్దంకమ్మ, పోతురాజులకు జాతరోత్సవాలు నిర్వహిస్తున్నారు. జాతర నిర్వహణవల్ల గ్రామంలోని అన్ని జీవరాశులకు ఆరోగ్యం, గ్రామంలో పంట పొలి పెరుగుతుందని గ్రామస్తుల నమ్మకం. జాతరలో భాగంగా శనివారం పోలేరమ్మ తల్లికి కుంకమ బండ్ల కార్యక్రమం నిర్వహించారు. జాతరలో గ్రామ దేవతలను ఆనందం కలిగించేందుకు గణాచార్యులు, పంబల్లు, బైనీడీలు తమ తమ పురాతన వాయిద్యాలతో కథలు చెబుతూ సాంప్రదాయమైన వీరంగం ఆడారు. గ్రామస్తులు కూడా ఉత్సవాల్లో పాల్గొని నృత్యాలు చేస్తారు. ఆచారవంతులు తమ తమ కులదేవతల ఆచారాలకు అనుగుణంగా పురాతన సాంప్రదాయ ఆచార వాయిద్యాలకు తోడుగా ఆధునిక తీన్‌మార్ డప్పులు, డ్రమ్ము, సైడ్‌డ్రమ్ము, కిలార్‌నట్ వాయిద్యాల మధ్య సాగుతుంది.

ఘనంగా చవితి వేడుకలు

భారీగా అన్నప్రసాద వితరణ



నరసరావుపేటలో పీచు కొబ్బరికాయలతో..



మాచవరంలో రూ.55 వేలు పలికిన లడ్డూ



గణపవరంలో నిమజ్జనానికి తరలుతున్న భారీ గణనాథుడు



ప్రకాష్‌నగర్‌లో ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు

నరసరావుపేట: స్థానిక పదో వార్డు సెయింట్ జోసెఫ్‌స్కూల్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన గణేష్ పందిరిలో శనివారం ఘనంగా చవితి కార్యక్రమాలు నిర్వహించారు. గత 12 ఏళ్లుగా వినాయక నవరాత్రుల నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మండపంలో స్వామివారిని ఏర్పాటుచేసి ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిరోజు నిమజ్జనోత్సవం సందర్భంగా భరతనాట్యం, కోలాటం నిర్వహించారు. ఈ ఏడాది స్వామివారి ప్రసాదంగా ఏర్పాటు చేసిన లడ్డును స్పాన్సర్ చేసిన వారే లడ్డు వేలంపాట పాడి చేజిక్కించుకున్నారు. పెద్ద లడ్డును మహాలక్ష్మి సీడ్స్ ప్రతినిధి వెలగా వెంకట శ్రీనివాసరావు, చిన్న లడ్డును కంజుల ఉదయలక్ష్మి పాటలో పాల్గొని అధిక రేటుకు పాడి దక్కించుకున్నారు. కులాలు మతాలు, రాజకీయాలకు అతీతంగా సుమారుగా 5 వేల మందికి స్వామివారి అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, కొత్త మద్ది లక్ష్మారెడ్డి, సీహెచ్ సోమశేఖర్‌రెడ్డి, గొట్టం సుబ్బారెడ్డి, దేవరపల్లి అంకిరెడ్డి, శివారెడ్డి, వల్లంరెడ్డి పెద్దిరెడ్డి, నోముల మల్లికార్జునరావు, కంజుల కోటిరెడ్డి, ఏ.నాగరాజు, కొత్తపల్లి అంజి, టి.వీరారెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా నిమజ్జనోత్సవానికి తరలించారు.

నాదెండ్ల: మండలంలో గణేశుని నిమజ్జనాలు శనివారం కొనసాగాయి. మండల పరిధిలో గణపవరంలో 3, సాతులూరులో 2, ఎండుగుంపాలెం, నాదెండ్ల, సంకురాత్రిపాడు గ్రామాల్లో ఒక్కో విగ్రహం చొప్పున నిమజ్జనం చేశారు. లంబోదరుడికి గ్రామోత్సవం నిర్వహించారు. గణపవరం శాంతినగర్‌లోని ట్రెండ్‌సెట్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం వద్ద సాంప్రదాయ దుస్తుల్లో చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భారీ అన్నదానం నిర్వహించారు. గణపవరం కొండ్రువారివీధిలో శివనాగేంద్రస్వామి పుట్ట వద్ద, శాంతినగర్‌లోని మరో విగ్రహాలను భారీ ఊరేగింపుతో నిమజ్జనం చేశారు. లడ్డూ ప్రసాదాల వేలం నిర్వహించారు.

నారికేళ గణపతయే నమః

నరసరావుపేట ఈస్ట్: టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం వద్ద యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పందిరిలోని గణనాథుడిని శనివారం పీచు కొబ్బరికాయలతో పూజాధికాలు నిర్వహించారు. స్వామివారికి 1,108 పీచు కాయలతో సహస్ర అష్టోత్తర పూజ జరిపారు. కాగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నట్లు కన్వీనర్ వనమా పవన్‌కుమార్ తెలిపారు.



గణపవరం శాంతినగర్‌లో వినాయకుని మండపంలో భక్తుల కోలాహలం

లడ్డూ ప్రసాదం రూ.55 వేలు

రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి శనివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని పందిట్లో ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన యర్రం రెడ్డి జగన్నాథరెడ్డి రూ. 55 వేల రూపాయలకు పాడుకున్నారు. విగ్రహాన్ని ఊరేగింపుగా గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

శృంగేరీ శంకరమఠం పరిసరాలు పరిశుభ్రం

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ



నరసరావుపేట: రానున్న దసరా నవ రాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని శృంగేరీ శంకరమఠం పరిసరాలను శనివారం మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. ఆయా పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. పారిశుధ్య కాంట్రాక్టర్ క్రాంతికుమార్‌కు పలు సూచనలు చేశారు. నిత్యం ఈ ప్రాంతం మొత్తం చెత్తాచెదారం లేకుండా ఉంచాలని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. అలాగే ప్రకాష్‌నగర్‌లోని వినాయకచవితి మండపం వద్ద అన్నదాన కార్యక్రమానికి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

కమిటీ సభ్యులను అడ్డుకోవటం దారుణం



నరసరావుపేట: ఇటీవల తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం సమీపంలోని కరకగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలు తెలుసుకునేందుకు వెళుతున్న తెలంగాణ పౌరహక్కుల సంఘం నాయకులను అడ్డుకోవటాన్ని ప్రజా, కుల సంఘాల నాయకులు ఖండించారు. శనివారం ఎన్‌జీవో హోంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడి చేసిన వాగ్దానాలు బూటకమని ఇటీవల జరుగుతున్న ఎన్‌కౌంటర్ల ద్వారా తేట తెల్లమవుతుందన్నారు.